

అప్పు చేసి కందిపప్పు కూడు

- రేషన్ పంపిణీలో కానరాని కందిపప్పు
- బహిరంగ మార్కెట్‌లో ధరల మోత
- కార్డుదారులు, డీలర్ల గగ్గోలు
- ఇదీ పౌర సరఫరాల శాఖ తీరు

రాష్ట్రంలో ఏ ముహూర్తాన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందో గాని రేషన్ డిపోల్లో ఇచ్చే కందిపప్పు కొండెక్కిపోయిందని సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. వరుసగా మూడో నెల కూడా రేషన్ డిపోల ద్వారా కందిపప్పు ఇవ్వకపోవడం గమనార్హం. కొన్ని నెలలు డిపోకు కేవలం వంద కిలోల కందిపప్పు మాత్రమే రావడం తెలిసిందే. ఈ నెల అది కూడా రాకపోవడంతో ఇటు కార్డుదారులు.. అటు డీలర్లు గగ్గోలు పెడుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. బయట మార్కెట్లో కందిపప్పు కొనేందుకు అప్పు చేయాల్సి వస్తోందని లబ్ధిదారులు వాపోతున్నారు.
– సీతమ్మధార

పౌర సరఫరాల శాఖ సర్కిల్–2లోని తూర్పు, ఉత్తర నియోజకవర్గాల పరిధిలో 152 రేషన్ డిపోలు ఉన్నాయి. వీటి పరిధిలో గల 1.53 లక్షల మంది రైస్ కార్డుదారులకు 78 వాహనాల ద్వారా రేషన్ సరకులు పంపిణీ చేస్తున్నారు. ప్రతి నెలా కార్డుదారులకు కేంద్ర ప్రభుత్వం ద్వారా వస్తున్న ఉచిత బియ్యం మాత్రమే ఇస్తున్నారు. వరుసగా మూడు నెలల పాటు కూడా బియ్యం, పంచదార తప్ప మూడో సరకు ఇస్తే ఒట్టు. ఇక ఈ నెలలో పలు ప్రాంతాల్లో గ్రామదేవతల పండగలు ఉన్నాయి. అయినప్పటికీ బియ్యంతోపాటు పంచదార మాత్రమే ఇవ్వడం గమనార్హం.

డిమాండ్ ఉన్నా.. పంపిణీ సున్నా

సాధారణంగా ఒక్కో డిపో పరిధిలో వెయ్యి వరకు రైస్ కార్డులున్నాయి. ఒక్కో డిపో డీలర్ కందిపప్పు కోసం ఇప్పటికే రూ.2 లక్షల వంతున డీడీలు చెల్లించారు. ఇప్పుడేమో కందిపప్పు రాకపోవడంతో కమీషన్ రాకపోగా.. అప్పులకు వడ్డీ కట్టాల్సి వస్తోందని డీలర్లు మదన పడుతున్నారు. నెలలు గడుస్తున్నా కందిపప్పు పంపిణీ మాత్రం కానరావడం లేదని కార్డుదారులు, రేషన్ డీలర్లు గగ్గోలు పెడుతున్నారు. కందిపప్పు కిలో బహిరంగ మార్కెట్‌లో రూ.170 ఉండగా.. సూపర్‌బజార్‌లో రూ.140, గృహమిత్ర కౌంటర్లలో రూ.130, రైతుబజార్లలో ప్రభుత్వ సబ్సిడీ కౌంటర్‌లో రూ.120 చొప్పున విక్రయిస్తున్నారు. రేషన్ డిపోలో కిలో కందిపప్పు రూ.67కే ఇవ్వడంతో డిమాండ్ అధికంగా ఉంటుంది. కేవలం బియ్యం, పంచదార మాత్రమే ఇస్తూ రేషన్ వాహనాల వద్ద గంటల తరబడి వేచి ఉండేలా చేస్తున్నారని కార్డుదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.


రేషన్ పంపిణీ వాహనం వద్ద సరకుల కోసం వేచి ఉన్న కార్డుదారులు

రేషన్ డిపోలు నిర్వీర్యం

కూటమి ప్రభుత్వం వచ్చాక రేషన్ డిపోలను పటిష్టం చేస్తామన్నారు. మూడు నెలలుగా కందిపప్పు పూర్తిగా ఇవ్వడం మానేశారు. రెండు నెలల కిందట పంచదార పూర్తి స్థాయిలో ఇవ్వలేదు. ఈ నెలలో ఆయా ప్రాంతాల్లో అమ్మవారి జాతరలు ఉన్నాయి. ఒక్కో డిపోకి వంద కిలోల కందిపప్పు కూడా రాకపోవడం అన్యాయమనే చెప్పాలి. బహిరంగ మార్కెట్‌లో కందిపప్పు ధరలు మండిపోతున్నాయి. రేషన్ డిపోలో కందిపప్పు ధర రూ.67 కావడంతో డిమాండ్ అధికంగా ఉన్నా ప్రభుత్వం వరుసగా మూడో నెల కూడా ఇవ్వకపోవడంతో కార్డుదారులు ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వం కందిపప్పు ఇవ్వకపోవడంతో కమీషన్ కోల్పోతున్నామని రేషన్ డీలర్లు వాపోతున్నారు.

బియ్యంతో సరిపెట్టేశారు

కూటమి ప్రభుత్వం వచ్చాక రేషన్ సరకులు పూర్తిస్థాయిలో కార్డుదారులకు అందడం లేదు. గత ప్రభుత్వ హయాంలో రేషన్ డిపోల ద్వారా బియ్యంతోపాటు కందిపప్పు, పంచదార ఇచ్చేవారు. గ్రామదేవతల పండగలు జరుగుతున్న నేపథ్యంలో కందిపప్పు ఇవ్వకపోవడం సరికాదు.
– కె.లత, సీతమ్మధార

కందిపప్పు ఎప్పుడిస్తారు?

గత నెలలో శివరాత్రి పండగ జరిగినా కందిపప్పు ఇవ్వలేదు. ఈ నెలలో అమ్మవారి ఉత్సవాలు జరుగుతున్నాయి. రేషన్ డిపోలకు కందిపప్పు మాత్రం రాలేదని చెబుతున్నారు. బియ్యం మాత్రమే ఇవ్వడంతో ప్రజలు బహిరంగ మార్కెట్‌లో అధిక ధరలకు కందిపప్పు కొనాల్సి వస్తోంది.
ఆర్.వాణి, గురుద్వారా

వైభవ వేంకటేశ్వరుడికి పంచామృతాభిషేకం


వైభవ వేంకటేశ్వరస్వామి

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలోని వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయంలో పాల్గుణ పూర్ణిమ సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 6.30 గంటలకు ఆర్జిత సేవా భక్తులు, దాతలు మంగళ ధ్వని, మేళతాళాల మధ్య ఆలయ ప్రదక్షణ చేశారు. ఉదయాస్తమాన సేవల అనంతరం పాలు, పెరుగు, తేనె, నెయ్యి, పంచదార, ఫలరసాలు, పసుపు, కుంకుమ, చందనం తదితర సుగంధ ద్రవ్యాలతో స్వామికి పంచామృతాభిషేకం జరిపారు. భక్తులు అత్యధికంగాస్వామిని దర్శించుకున్నారు. ఆలయ ఈవో బి.ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

నేడు సుప్రభాత సేవ

వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం సుప్రభాత సేవ నిర్వహిస్తారు. తెల్లవారుజామున సన్నిధిగొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపిస్తారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేస్తారు. 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్ఠి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్ర నామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన జరుగుతాయి. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేస్తారు. సాయంత్రం 6.30 గంటలకు వైభవుడికి విశేష హారతులు సమర్పిస్తారు.

అనకాపల్లి నూకాంబికా దేవస్థానం ఈవోగా వెంపలి

మహారాణిపేట: అనకాపల్లిలోని శ్రీ నూకాంబికా అమ్మవారి దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా సింహాచలం దేవస్థానం ఏఈవో వెంపలి రాంబాబు నియమితులయ్యారు. శ్రీ కనకమహాలక్ష్మి ఆలయంలో ఏఈవోగా పనిచేస్తున్న రాంబాబును ఇటీవల సింహాచలం దేవస్థానం ఏఈవోగా బదిలీ చేశారు. ఆయనకు సహాయ కమిషనర్‌గా పదోన్నతి లభించడంతో అనకాపల్లి దేవస్థానానికి సహాయ కమిషనర్, ఈవోగా నియమించారు.

క్లుప్తంగా

వృద్ధాశ్రమంలో వేడుకలు


వానప్రస్థ వృద్ధాశ్రమంలో హోలీ వేడుకలు

మురళీనగర్: మురళీనగర్ పరిసర వాసులు శుక్రవారం హోలీ పండగను ఉత్సాహంగా జరుపుకున్నారు. అపార్ట్‌మెంట్లు, పార్కుల్లో పిల్లలు, పెద్దలు ఒకరికిపై ఒకరు రంగులు చల్లుకుని ఆనందంగా గడిపారు. పట్టాభిరెడ్డితోటలోని వానప్రస్థ వృద్ధాశ్రమంలో ఇండియన్ నేవీ షిప్ ఐఎన్‌ఎస్ సావిత్రి సభ్యులు వృద్ధుల మధ్య హోలీ వేడుకలు నిర్వహించారు. వృద్ధులకు రంగులు రాసి తమ ఆదరాభిమానాలను చాటుకున్నారు. వృద్ధాశ్రమ నిర్వాహకుడు రొబ్బి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉమా నీలకంఠేశ్వరాలయంలో అన్నసంతర్పణ


భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న ఆలయ ఈవో బండారు ప్రసాద్

సీతమ్మధార: పౌర్ణమి సందర్భంగా శుక్రవారం నక్కవానిపాలెంలోని ఉమా నీలకంఠేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకుడు మహేష్ ఆధ్వర్యంలో పంచామృతం, పలురకాల పళ్ల రసాలతో అభిషేకాలు చేశారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో అన్నసంతర్పణ చేపట్టారు. ఆలయ ఈవో బండారు ప్రసాద్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. కార్యక్రమంలో రాజు, నక్క అప్పలరెడ్డి, ఆలయ సిబ్బంది చంద్రశేఖర్, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వీఎల్‌వో క్యాడర్‌కు గెజిటెడ్ హోదా కల్పించాలి


సమావేశంలో పాల్గొన్న ఫెడరేషన్ సభ్యులు

ఏయూక్యాంపస్: ఆంధ్రప్రదేశ్ నాన్ గ్యాడ్యుయేట్ వెటర్నరియన్స్ ఫెడరేషన్ జోన్–1 కార్యవర్గ సమావేశం శనివారం పశుసంవర్ధక శాఖ సంచాలకుల కార్యాలయం ఆవరణలో నిర్వహించారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల నుంచి సభ్యులు ఈ సమావేశానికి హాజరయ్యారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర ఫెడరేషన్ చైర్మన్ బి.సేవా నాయక్, ప్రధాన కార్యదర్శి బి.గోవిందరాజు, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆర్.విజయ సారధి, కోశాధికారి డి.కోదండ రావు, పాల్గొని సమస్యలపై చర్చించారు. ప్రధానంగా వీఎల్‌వో క్యాడర్‌కు గెజిటెడ్ హోదా కల్పించాలని, పారా వెటర్నరీ కౌన్సిల్ పూర్తిస్థాయిలో ప్రభుత్వం త్వరగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి విశాఖ జిల్లా ఫెడరేషన్ చైర్మన్‌గా డి.కోదండరావును, అనకాపల్లి జిల్లా ఇంచార్జి చైర్మన్‌గా వెంకట లక్ష్మిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో కో చైర్మన్ వైవీ ప్రసాద రావు, ఎం.రాఘవరావు, ఎం.సాగర్ బాబు, ఆర్.రవికుమార్ పాల్గొన్నారు.

ఎంవీపీ రైతుబజార్‌లో కమిషనర్ తనిఖీలు


రైతుబజార్‌లో అధికారులకు సూచనలిస్తున్న మార్కెటింగ్ శాఖ కమిషనర్ విజయ సునీత

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీ రైతు బజార్‌ను రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ శాఖ కమిషనర్ ఎం.విజయ సునీత సందర్శించారు. ఉత్తరాంధ్ర పర్యటన నేపథ్యంలో విశాఖకు వచ్చిన ఆమె శుక్రవారం సాయంత్రం ఎంవీపీ రైతుబజార్‌ను తనిఖీ చేశారు. ఇటు రైతులకు, అటు వినియోగదారులు ఇబ్బందులు లేకుండా ధరలు అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. పలువురు రైతులతో ముచ్చటించారు. రైతుల కార్డులు, డ్వాక్రా కౌంటర్లను పరిశీలించారు. రైతులు తీసుకొస్తున్న టమోటా, డ్వాక్రా రైతులు అమ్ముతున్న ఉల్లిపాయల నాణ్యతను పరిశీలించారు. రైతులకు అవసరమైన సౌకర్యాలు అందిస్తున్నారా లేదా అనే అంశంపై ఆరా తీశారు. ప్రతి నెల 3వ శనివారం స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించాలని, అందులో రైతులను భాగస్వాములను చేయాలని సూచించారు.

హ్యాపీగా.. జాలీగా హోలీ


నార్త్ ఎక్స్‌టెన్షన్‌లో విద్యార్థినుల సందడి


బాపూజీనగర్‌లో హోలీ జరుపుకుంటున్న చిన్నారులు

సీతమ్మధార: రంగుల పండగ హోలీని శుక్రవారం నియోజకవర్గ ప్రజలు ఆనందోత్సాహాల నడుమ ఘనంగా జరుపుకున్నారు. సీతమ్మధారలోని ల్యాన్సమ్ ఆక్సిజన్ టవర్స్ ప్రాంగణమంతా కలర్‌ఫుల్‌గా మారింది. టవర్స్ నివాసులంతా ఒకే కుటుంబంగా మారి చిన్నాపెద్దా అనే తేడా లేకుండా హోలీ సంబరాలు నిర్వహించారు. కలర్‌ఫుల్ రెయిన్ డ్యాన్స్, డీజే డ్యాన్స్‌లతో హోరెత్తించారు. యువత కేరింతలతో మరింత జోష్ పెరిగింది. ఆక్సిజన్ టవర్స్ ప్రాంగణంలో ప్రతి వేడుక ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహిస్తామని ఆక్సిజన్ టవర్స్ రెసిడెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు తిరుపతిరాజు తెలిపారు. అందరికీ హోలీ శుభాకాంక్షలు తెలిపారు. కమిటీ ప్రతినిధుల రెసిడెంట్స్ కుటుంబాల సభ్యులంతా పాల్గొన్నారు.

- సీతమ్మధార, బాలయ్యశాస్త్రి లేఅవుట్, నార్త్ ఎక్స్‌టెన్షన్ ప్రాంతాల్లో హోలీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. బీజేపీ నేత శ్యామలాదీపిక, సునీల్ అగర్వాల్ కుటుంబ సభ్యులు, స్థానిక చిన్నారులు, యువత, విద్యార్థులు హోలీ రంగుల వర్షంలో ఆడిపాడారు.


హోలీ సంబరాల్లో శ్యామలాదీపిక, సునీల్ అగర్వాల్ కుటుంబ సభ్యులు

పోర్ట్ స్టేడియంలో ఫుల్ జోష్

అక్కయ్యపాలెం పోర్ట్ స్టేడియంలో హోలీ సంబరాలు అంబరాన్నంటాయి. కలర్‌ఫుల్ రెయిన్ డ్యాన్స్, డీజే సౌండ్స్‌తో యువత హోరెత్తించారు. నిర్వాహకుడు నవాజ్ ఈవెంట్ ఆధ్వర్యంలో హోలీ వేడుకలు జరిగాయి. యువతులు, చిన్నారులు సందడి చేశారు.

సందడి సందడే

కంచరపాలెం: కంచరపాలెం పరిధిలో చిన్నారులు, యువత రంగులు చల్లుకుని ఒకరికొకరు హోలీ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. 104 ఏరియా బాపూజీనగర్, ఐటీఐ జంక్షన్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, జ్ఞానాపురం, తాటిచెట్లపాలెం, కంచరపాలెం, ఊర్వశి కూడలి తదితర ప్రాంతాల్లో యువత, చిన్నారులు సందడి చేశారు. విద్యార్థులకు సంస్కృతీ సంప్రదాయాలపై అవగాహన కల్పించడానికే హోలీ వేడుకలు నిర్వహించినట్లు స్థానిక నిర్వాహకులు తెలిపారు.


పోర్ట్ స్టేడియంలో డప్పు వాయిస్తున్న యువతి


యువతుల కేరింత


సీతమ్మధార ఆక్సిజన్ టవర్స్‌లో మహిళల హోలీ జోష్


కుటుంబ సభ్యుల సందడి

పరుల హితమే మాస్టర్ ఈకే జీవితం


మహిళలకు కుట్టు మిషన్లు అందిస్తున్న అచ్యుత రామరాజు, సుబ్బలక్ష్మి, సత్యదేవ్

తాటిచెట్లపాలెం: పరుల హితం కోసమే మాస్టర్ ఈకే నిరంతరం నిస్వార్థ సేవలు అందించారని, అదే ఆయన జీవన విధానమని ది వరల్డ్ టీచర్ ట్రస్ట్(జగద్గురు పీఠం) డైరెక్టర్ ఆఫ్ పబ్లికేషన్స్ చింతలపాటి సత్యదేవ్ అన్నారు. మాస్టర్ ఈకే 41వ వర్ధంతి సందర్భంగా ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం తాటిచెట్లపాలెంలోని సంస్కృతి సదన్‌లో ప్రత్యేక, సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యదేవ్ మాట్లాడుతూ మాస్టర్ ఈకే దేశ, విదేశాల్లో వేలాది మందిలో సేవా దృక్పథం, ఆధ్యాత్మిక చైతన్యం కలిగించారని, ఆయన రచించిన శతాధిక గ్రంథాలు నేడు సాధకులకు మార్గదర్శకంగా ఉన్నాయన్నారు. ముఖ్య అతిథి జనశిక్షణ సంస్థాన్ చైర్మన్ సి.అచ్యుత రామరాజు మాట్లాడుతూ జగద్గురు పీఠం, స్కిల్ ఇండియా సంయుక్తంగా పలు వృత్తి విద్యల్లో అనేక శిక్షణ తరగతులను కొన్నేళ్లుగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీని ఫలితమే నేడు వందలాది మంది పేద మహిళలు స్వయం ఉపాధిని కల్పించుకుంటున్నారన్నారు. బ్యూటీషియన్, ఎంబ్రాయిడరీ కోర్సుల్లో ఉత్తీర్ణులైన 60 మంది మహిళలకు అతిథుల చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందించారు. 8 మంది మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్లు అందజేశారు. కార్యక్రమంలో మాస్టర్ హోమియో వైద్యాలయం నిర్వాహకురాలు డాక్టర్ అజ్జరపు సుబ్బలక్ష్మి, జగద్గురు పీఠం డైరెక్టర్ బి.ఉషారాణి, గొల్లపూడి రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులతో ప్రజా ఉద్యమాలను ఆపలేరు



ధర్నా చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

తాటిచెట్లపాలెం: పాలకులు ఉద్యమకారులను అక్రమ అరెస్టులు చేసి ప్రజా ఉద్యమాలను ఆపలేరని ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వామన మూర్తి అన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను వెంటనే ఆపాలని, అక్రమంగా తొలగించిన కాంట్రాక్ట్ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ నరసింహనగర్ రైతుబజార్ వద్ద శుక్రవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 14న విశాఖలో అఖిలపక్ష రాజకీయ పార్టీలు, కార్మిక సంఘాలు, ప్రజా సంఘాల నిరసన ప్రదర్శనలకు ఇచ్చిన పిలుపును అడ్డుకోడానికి స్టీల్‌ప్లాంట్, గాజువాక పోలీసులు తమ నాయకులను అరెస్టులు చేశారన్నారు. ఈ విధంగా అక్రమ అరెస్టులు చేస్తే ప్రభుత్వం తగిన విధంగా మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఏళ్ల తరబడి ప్రజా ఉద్యమాలు జరుగుతుంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ఎంపీలు, మంత్రులు చోద్యం చూస్తున్నారని మండిపడ్డారు. సీఎం చంద్రబాబు, మంత్రులు లోకేష్, పవన్ విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు ప్రధాని మోదీతో పోరాడాలని, లేనిపక్షంలో ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు.

ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు


వాహన చోదకుడికి సూచనలిస్తున్న ట్రాఫిక్ సీఐ దాశరథి

మర్రిపాలెం: ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని కంచరపాలెం ట్రాఫిక్ సీఐ దాశరథి హెచ్చరించారు. శుక్రవారం రాత్రి మాధవధార, మురళీనగర్ ప్రాంతాల్లో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. రోడ్డుపై అడ్డదిడ్డంగా వాహనాలు పార్క్‌చేసిన వారికి, హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపిన వారికి ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. రోడ్డుపై వాహనాలను నిలిపిన వారితో స్వయంగా మాట్లాడి పలు సూచనలిచ్చారు. వాహనాలను రాంగ్ పార్కింగ్ చేయకూడదని, హెల్మెట్ తప్పక ధరించి సురక్షితంగా ఇళ్లకు చేరుకోవాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవన్నారు. పలు వాహనాలకు జరిమానాలు విధించారు. ట్రాఫిక్ ఎస్ఐ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

సీపీ చొరవతో ఇంటికి చేరిన నిజామాబాద్ వాసి


వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ నరసింహమూర్తి

ఎంవీపీకాలనీ: నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి చొరవతో నిజామాబాద్‌కు చెందిన శ్రీను అనే వ్యక్తి సొంతింటికి చేరాడు. శుక్రవారం ఎంవీపీ పోలీసుల సమక్షంలో కుటుంబ సభ్యులకు అతడిని అప్పగించారు. పదేళ్లుగా శ్రీను జాడ కోసం పరితపిస్తున్న కుటుంబ సభ్యులు ఆనందంతో పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. ఎంవీపీ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి ఈ వివరాలు వెల్లడించారు. ఇటీవల సీపీ బాగ్చి బీచ్ రోడ్డులో ప్రయాణిస్తుండగా లాసన్స్ బే కాలనీలో మతిస్థిమితం లేకుండా, దుస్తులు కూడా సరిగా లేని ఓ వ్యక్తి ఉండటాన్ని గమనించారు. అతడిని సంరక్షించి వివరాలు తెలుసుకోవాలని సూచించడంతో ఆ దిశగా ఎంవీపీ పోలీసులు చర్యలు చేపట్టారు. సీఐ మురళీ సూచనలతో ఆ వ్యక్తిని ముందుగా రెడ్‌క్రాస్ షెల్టర్‌లో చేర్పించారు. షెల్టర్ నిర్వాహకులు అతడిని సంరక్షించి, వివరాలు సేకరించగా.. శ్రీనుది నిజామాబాద్‌గా చెప్పినట్లు వారు పోలీసులకు సమాచారమిచ్చారు. దీంతో సీఐ మురళీ బృందం అతడి కుటుంబ సభ్యుల వివరాలు సేకరించి అక్కడి పోలీసులకు సమాచారం అందించారు. శుక్రవారం వారు నగరానికి చేరుకోగా.. ఎంవీపీ పోలీస్ స్టేషన్‌లో శ్రీనును అతడి తమ్ముడు, ఇతర కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ సందర్భంగా శ్రీను తమ్ముడు మాట్లాడుతూ తన అన్నను అప్పగించిన విశాఖ పోలీసులకు కృతజ్ఞతలు తెలిపాడు. సీపీ, ఏసీపీతోపాటు ఎంవీపీ పోలీసుల సేవలను అభినందించారు.

సీఆర్పీల సమస్యల పరిష్కారానికి కృషి


ప్రమాణ స్వీకారం చేస్తున్న సీఆర్పీ నూతన కమిటీ సభ్యులు

తాటిచెట్లపాలెం: అక్కయ్యపాలెం ఎన్‌జీజీవోస్ కాలనీలోని జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం క్లస్టర్స్ రిసోర్స్ పర్సన్స్(సీఆర్పీ) సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సీఆర్పీల సమస్యలపై చర్చించి, నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు ప్రమాణ స్వీకారం చేసి మాట్లాడుతూ సీఆర్పీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. కమిటీల ఏర్పాటులో మండల సీఆర్పీలు శివాజీ, ఈశ్వరరావు, రాంబాబు కీలకంగా వ్యవహరించారు. కార్యక్రమంలో విశాఖ జిల్లా సీఆర్పీలు పాల్గొన్నారు.